ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 1 మార్చి 2025 5





తాళ్ళపూడిలో పరీక్షా కేంద్రం పరిశీలన

## హాకీలోనూ.. సివిల్ పవర్ చూపారు!

చదువుల్లోనే కాదండోయ్.. ఆటల్లోనూ తగ్గేదేలే అన్నారు.. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు వారాలుగా హోరా హోరీగా సాగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్న మెంట్ శుక్రవారం ముగిసింది. పోటీల్లో భాగంగా మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఒడిశా సెక్రటేరియట్ టీమ్‌కు ట్రోఫీ అందజేసి అభినందించారు.



6

## గోదాటిలో.. తలపడ్డారు!

బైక్ రేస్ తెలుసు.. కార్ రేస్ తెలుసు.. మరి బోట్ రేస్ గురించి ఇప్పటివరకూ ఎక్కడైనా విన్నారా.. చూశారా.. విని ఉంటారు కానీ చూసి ఉండరు.. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం బోట్ రేస్ సాగింది.. సుమారు 15 పడవలు వేసుకుని హోరాహోరీగా ఇలా తలపడ్డారు.. ముగ్గురు విజేతలుగా నిలిచారు.



7

# నిమిషం ఆలస్యమైనా నో

- నేటి నుంచి సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు
- రెండేళ్లు 43,754 విద్యార్థులు.. 51 కేంద్రాలు
- 9 గంటలకు పరీక్ష..8.30 గంటలకే హాజరవ్వాలి
- కంట్రోల్ రూమ్ నెంబర్ 0883 2473430
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

## ఇంటర్ పరీక్షకు అనుమతి నిరాకరణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం (నేడు) నుంచి పకడ్బందీ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూంలో ఫోన్ నెంబరు 0883 2473430ని ఏర్పాటు చేశారు. ఉదయం సరిగ్గా 9 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు ముగుస్తుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షలు నిర్వహించే 51 కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతున్నారు.మొదటి ఏడాది జనరల్ 20,591, ఒకేషనల్ 2,226, రెండో ఏడాది జనరల్ 19,062, ఒకేషనల్ 1,875 కలిపి మొత్తం 43,754 మంది విద్యార్థులు హాజరవుతారని ఇంటర్ విద్య ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్‌వీఎల్.నరసింహం తెలిపారు. విద్యార్థులు సమయానికి గమ్యానికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు సరఫరాలో అంతరాయం కలగడానికి వీల్లేదన్నారు. ఫ్యాన్లు, సరిపడా లైటింగ్ ఉండేట్లు చూడాలని ఆదేశించారు.హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తారసపడితే వారిని పరీక్షా కేంద్రం వద్దకు చేర్చడానికి వాహన దారులు..ఆటోవాలాలు ఉదారంగా వ్యవహరించాలి. అలాంటి విద్యార్థులను పరీక్షా కేంద్రం వద్దకు తీసుకెళ్లి పెద్ద మనసు చాటుకోవాలి. దివ్యాంగులకు అయితే కచ్చితంగా సహాయం చేయాల్సిందే.

### కలిసొచ్చిన సెలవులు..

ప్రథమ ఏడాది విద్యార్థులకు మార్చి 1న లాంగ్వేజీ, 4న ఇంగ్లీషు, 6న లెక్కలు-1ఏ, బోటనీ, సివిక్స్, 8న లెక్కలు-1బీ, జువాలజీ, హిస్టరీ, 11న ఫిజిక్స్,ఎకనామిక్స్, 13న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్,17న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్, 19న మోడరన్ లాంగ్వేజీ, జియోగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తారు.అవే సబ్జెక్టులు రెండో ఏడాది విద్యార్థులకు మార్చి 3, 5, 7, 10, 12, 15, 18, 20 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల మధ్య సమయం ఎక్కువగా ఇచ్చారు.1న లాంగ్వేజ్ పరీక్ష జరిగితే 2, 3 సెలవు. 4న ఇంగ్లీషు పరీక్ష ఉంది. అలాగే ప్రథమ,ద్వితీయ ఏడాది విద్యార్థులకూ ప్రతి సబ్జెక్టుకూ రెండు రోజుల సమయం ఉంది.కాబట్టి ప్రశాంతంగా సిలబస్ రివిజన్ చేసుకుంటే సరిపోతుంది. సైడ్ హెడ్డింగ్‌లు, ఫార్ములాలు గుర్తు పెట్టుకుంటే సగం జవాబు వచ్చినట్లేనని అంటున్నారు.

### పటిష్ట బందోబస్తు

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ నర సింహ కిషోర్ పేర్కొన్నారు. కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కేసులు తప్పవన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై దృష్టి సారించామని చెప్పారు.





## కూటమి సూపర్ బడ్జెట్

సంక్షేమంలో 'పద్దు' పొడిచింది.. పయ్యావుల పద్దు సంక్షేమం, అభివృద్ధి మంత్రం జపించింది. అన్ని వర్గాల ను లక్ష్యంగా చేసుకుని వరాల వాన కురిపించింది. మహిళలను మురిపించి.. అన్నదాతలను మెప్పించి... పేదలకు భీమా కల్పిస్తూ బడ్జెట్ పద్దు బహుబాగు అనిపించింది. పేదలకు ఆరోగ్య భీమా కల్పించింది. ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నట్టు ప్రకటించి ధైర్యం ఇచ్చింది.. ఎన్ని కల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు శ్రీకారం చుట్టేలా పద్దులో కేటాయింపులు చేసింది.. - (కాకినాడ/ఆంధ్రజ్యోతి)

## మురిపించేను

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం రైతులను సంతృప్తిపరిచింది. ఎంతో కాలంగా డెల్టా ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాలు మూలనపడిపోయాయి. పోలవరం ప్రాజెక్టు సైతం నత్తనడకన సాగుతోంది. బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు రూ.6705 కోట్లు కేటాయించడంతో పనుల వేగానికి ఇంధనంగా ఉపయోగపడతాయి. పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ఇటీవల 900 కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. సాధ్యమైనంత మేర నిర్వాసితులందరినీ కాలనీలకు చేర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇక ధవళేశ్వరం కేంద్రంగా ఉన్న గోదావరి డెల్టా సిస్టమ్ ఆధునికీకరణకు రూ.200 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ఏటిగట్ల అభివృద్ధికి మరో రూ.200 కోట్లు కేటాయించారు. పోలవరం లిఫ్ట్‌కు రూ.100 కోట్లు, తాడిపూడి ఎత్తిపోతల పథకానికి రూ.14 కోట్లు, వెంకటనగర్ ఎత్తిపోతలకు రూ.4 కోట్లు, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు రూ.75.51 కోట్లు, సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు రూ.7.5 కోట్లు కేటాయించి జీవం పోవారు. ధవళేశ్వరం ఇరిగేషన్ పరిధిలో వేసవి కాలంలో చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు రూ.75 కోట్లు కేటాయించారు. ఆయిల్ పామ్ పంటల ప్రోత్సాహ నికి తూర్పు గోదావరి జిల్లాను ప్రత్యేకంగా ఎంపిక చేసింది.బడ్జెట్‌లో రూ.7,556 కోట్లు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి అనేక రకాల పథకాల అమలుకు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

- అదిరిన 'పయ్యావుల' పద్దు
- రూ.25 లక్షల ఆరోగ్య బీమా
- 12.50 లక్షల కుటుంబాలకు భీమా
- మే నుంచే 'తల్లికి వందనం'
- 16.51 లక్షల మంది పిల్లలకు లబ్ధి
- అన్నదాత సుఖీభవకు 4.54 లక్షల మంది
- 19.80 లక్షల మందికి ఆదరణ
- స్కూళ్లకు తీరిన కరెంటు బిల్లు బాధ
- మునిసిపాలిటీలకు మళ్లీ ఆర్థిక స్వేచ్ఛ
- మత్స్యకారులకు నిధుల పొంగు

### బీమా...ఆరోగ్య భీమా..

పేద వర్గాలకు ఆరోగ్యపరంగా ధీమా కల్పించేందుకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని పేదలకు అమలు చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో రూ.19,264 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ప్రకటించిన రూ.25 లక్షల ఆరోగ్య బీమా పేదల జీవితాలకు మేలి మలుపే. ఈ బీమాతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పైసా చెల్లించక్కర్లేకుండా చికిత్స పొందొచ్చు. ఈ వరంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు 12.50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

### తల్లులకు ఇక పండగే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కూటమి ప్రభుత్వం రూ.9,407 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ,ప్రైవేటు స్కూళ్లు,కాలేజీల్లో చదువుతున్న ఒకటి నుంచి 12వ తరగతి వరకు రూ.15 వేలు జమ చేస్తామని ప్రకటించారు. మే నెలలోగా తల్లుల ఖాతా ల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. జిల్లాకు రూ.2,476 కోట్ల నిధులొస్తాయి.

### మరింత ఆదరణ..

గత టీడీపీ ప్రభుత్వంలో బీసీల్లో ఆయా వర్గాల స్వయం ఉపాధికి అనుగుణంగా ఆద రణ పథకం కింద సీఎం చంద్రబాబు పని ముట్లను అందించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదరణ అటకెక్కించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం ఆదరణ పథకం అమలుకు శుక్రవారం నాటి బడ్జెట్‌లో వెయ్యి కోట్లు ప్రకటించారు.

### సొంతింటి కల నెరవేరినట్లే..

బడ్జెట్‌లో ప్రధానంగా రహదారుల శాఖకు రూ.8,785 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో అనేక రహదారుల మరమ్మతులకు, కొత్త వాటికి నిధులు రానున్నాయి. గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు కేటాయించడంతో పేదల ఇళ్లకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఆధునికీకరణ పనులకు రూ.848 కోట్లు కావాలి. అయితే ఈ రెండేళ్లలో వీటిని పట్టాలెక్కించేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉన్నత విద్యకు సంబంధించి కేటాయింపులు పెరిగాయి. ఆదికవి నన్నయ వర్సిటీకి రూ.12.50 కోట్లు, జేఎన్టీయూకి రూ.60 కోట్లు కేటాయించారు.

### మునిసిపాలిటీలకు వీడిన సంకెళ్లు

పట్టణాలు, నగరాల అభివృద్ధిలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లదే కీలకపాత్ర. గత వైసీపీ ప్రభు త్వం వీటిని పూర్తిగా సర్వనాశనం చేసేసింది. గడచిన ఐదేళ్లలో మునిసిపాలిటీల్లో డబ్బులు ఖర్చుచేయడం గగనంగా మారింది. ఏప్రిల్ నుంచి మునిసిపాలిటీలు తమ చెల్లింపులు తమ నిధుల నుంచి ఖర్చుచేసుకునేలా కీలక నిర్ణయం ప్రకటించింది. దీంతో పుర పాలికలకు మళ్లీ మంచిరోజులు వచ్చినట్లయింది.

### మత్స్యకారులకు వరం..

మత్స్యకార భరోసా రూ.450 కోట్లు కేటాయించారు. ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునే పేరుతో అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని రూ.20 వేలు చేస్తామని చెప్పింది. బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించింది.ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మంది మత్స్యకారులకు మేలు జరగనుంది.

### తాగునీటికి.. బెంగ లేదిక..

జలజీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే ఉద్దేశంతో 8.46 లక్షల కుళాయిలను అందించాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.1,203 కోట్లతో ప్రణాళికలు రచించారు. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చేసింది. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా విధించుకుంది. బడ్జెట్‌లో రూ.2,800 కోట్లు కేటాయించింది. ఈ పథకానికి నిధుల బెంగతీరింది.

### బడికి బిల్లులు బాధ తీరినట్టే..

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇవ్వనున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2 వేలకుపైగా స్కూళ్లు ఉన్నాయి. ఇకపై ఉచితంగా విద్యుత్ ఇవ్వనుండడంతో పాఠశాలలకు నిధుల బెంగ తప్పనుంది.

### అన్నదాత.. సుఖీభవ

సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ మేరకు రూ.6,300 కోట్లు కేటాయించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాతలకు ఇక సాగు ఖర్చుల బెంగ తీరనుంది. గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం పేరుతో కేంద్రవాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి అన్నదాతలను మోసం చేసింది. రైతులకు అండగా చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హులైన ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఫలితంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

| ప్రాజెక్టు | రూ.కోట్లలో |
|---|---|
| పోలవరం ప్రాజెక్టు | 6.705 |
| గోదావరి డెల్టా సిస్టమ్‌కు | 200 |
| ఏటిగట్ల అభివృద్ధికి | 200 |
| పోలవరం లిఫ్ట్‌కు | 100 |
| తాడిపూడి ఎత్తిపోతలకు | 14 |
| వెంకటనగర్ ఎత్తిపోతలకు | 4 |
| పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు | 75.51 |
| తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు | 7.5 |
| సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు | |

### ఏపీకి వెలుగునిచ్చే బడ్జెట్..



రాష్ట్ర పునర్ నిర్మాణం, అభివృద్ధి సంక్షేమానికి చిరునామా రాష్ట్ర బడ్జెట్.పర్యాటక రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు సంతృప్తికరం.బడ్జెట్‌లో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు 469 కోట్లు కేటా యి ంపు సంతోషకరం. కూటమిలో ఆంధ్రప్రదేశ్ ఓ వెలుగు వెలుగుతుంది.
- కందుల దుర్గేష్, మంత్రి

### ఇదీ సూపర్ సిక్స్ బడ్జెట్



అందరికి ఆమోదయోగ్యమైన బడ్జెట్. సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్ రూపొందించారు.మే నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు తల్లికి వందనం పథకాలను అమలుచేసేందుకు చర్యలు చేపట్టారు. మొత్తంగా చూస్తే ఇది జనరంజక బడ్జెట్ .
- గోరంట్ల, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే

### కరెంట్ కష్టాలు తీర్చిన బడ్జెట్



అద్భుతమైన బడ్జెట్. ఎస్సీ ఎస్టీలు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్.. చేనేత మగ్గాలపై ఆధారపడి బతికేవారికి 500 యూనిట్లు అందించేలా బడ్జెట్‌లో ప్రస్తావించారు.టిడ్కో ద్వారా 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్.
- ఆదిరెడ్డి వాసు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే

### వ్యవసాయానికి మేలు



ఆర్థికంగా అణగారిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టిని కలిగించే విధంగా బడ్జెట్ రూపొందించడం అభినందనీయం. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు చర్యలు చేపట్టడం రైతులకు ఊరట నిచ్చింది.వ్యవసాయానికి మేలు చేకూర్చేలా బడ్జెట్ ఉంది.
- ఎన్.రామకృష్ణారెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే

### జలజీవన్ మిషన్‌కు జీవం



బడ్జెట్‌లో బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట వేశారు.వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించారు.ఎస్సీ బీసీలకు ఇళ్ల నిర్మాణానికి అదనంగా రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 70వేలు అందించడానికి చర్యలు.జలజీవన్‌మిషన్ పథకంలో గోదావరి జలాలు అందించడానికి చర్యలు.
- ఎం.వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే

### ప్రతి కుటుంబానికి చేయూత



పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేలా బడ్జెట్ ఉంది. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించడం జరిగింది.ఎన్నికల హామీల్లో భాగమైన సూపర్ సిక్స్ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడం హర్షించదగ్గ విషయం.
- ఎం.వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే

### బడ్జెట్ బాగుంది..



రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం బడ్జెట్ రూపొందించింది. సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికి సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇచ్చారు. బడ్జెట్ బాగుంది.
- బత్తుల బలరామకృష్ణ,రాజానగరం ఎమ్మెల్యే

## ఏప్రిల్ లోపు నామినేటెడ్ పదవులు

### సీఎం చంద్రబాబు ప్రకటన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మళ్లీ నామినేటెడ్ పదవుల సందడి మొదలైంది. ఏప్రిల్ నెల లోపు నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించడంతో క్యాడర్‌లో జోష్ పెరిగింది.అమరావతిలోని అసెంబ్లీ హాల్‌లో శుక్రవారం ఆయన టీడీఎల్‌పీ సమావేశంలో మాట్లాడారు.మార్కెట్, దేవస్థాన కమిటీలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల నుంచి పేర్లు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు సూచించారు.నామినేటెడ్ పదవులు త్వరలోనే ఇస్తామని ప్రకటించడంతో కూటమి శ్రేణుల్లో సందడి నెలకొంది.పార్టీ నేతలంతా కేడర్‌ను ద్వితీయ శ్రేణి నాయకులను కలుపుకుని ముందుకువెళ్లాలని ఆయన క్లాస్ తీసుకున్నారు.

## రీజనల్ సైన్స్ సెంటర్‌కి స్వామి జ్ఞానానంద పేరు పెట్టాలి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో బొమ్మూరు వద్ద నిర్మించిన రీజనల్ సైన్స్ సెంటర్‌కు స్వామి జ్ఞానానంద పేరును పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వ అటవీ పర్యావరణ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము

**కేంద్రానికి రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ లేఖ**

లేఖ రాశారు. రాజమహేంద్రవరంలో రూ15.20 కోట్లతో ఈ సెంటర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. న్యూక్లియర్ సైన్స్ బోధనలో స్వామి జ్ఞానానంద తన ప్రత్యేకత చాటుకున్నారు.ఎందరో విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా తయారు చేసిన స్వామి జ్ఞానానంద పేరు పెట్టాలని లేఖలో పేర్కొన్నారు.




**చికెన్ క్యూ**

చికెన్ కొనుగోలు చేయమంటే బర్డ్ ఫ్లూ అంటున్నారు.. ఫ్రీ అంటే మాత్రం ఎగబడిపో తున్నారు.. ఈ చిత్రంలోనే చూడండి.. అనపర్తిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత చికెన్ మేళాకు జనం ఇలా క్యూ కట్టారు. ఏకంగా 3 వేల మందికి ఉడికించిన గుడ్లు, ఫ్రై చేసిన చికెన్ ఉచితంగా పంపిణీ చేశారు. - అనపర్తి

## ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.13,78,627

### జిల్లా వ్యాప్తంగా 64 బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీకి ఈ ఏడాది రూ.13,78,627 ఆదాయం లభించింది. శివరాత్రి పుణ్యస్నానాలకు వెళ్లే భక్తుల కోసం వివిధ రూట్లలో మొత్తం 64 బస్సు సర్వీసులను నడిపారు. రాజమహేంద్రవరం డిపో నుంచి 15 బస్సులు ఆపరేట్ చేశారు. కోటిపల్లి నాలుగు, వంగలపూడి నాలుగు, శ్రీశైలం ఏడు బస్సులు నడపడం ద్వారా రూ.2,80,086లు ఆదాయం ఆర్జించారు. కొవ్వూరు డిపో నుంచి 27 బస్సులు పట్టిసీమకు నడపడం ద్వారా రూ.5,92,458లు, నిడదవోలు డిపో నుంచి కూడా 13 బస్సులు పట్టిసీమకు నడపడం ద్వారా రూ.2,83,935లు,గోకవరం డిపో నుంచి 9 సర్వీసులు నడపడం ద్వారా రూ.2,22,148లు ఆదాయం ఆర్జించినట్టు ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక వెల్లడించారు.



# ప్రకృతి వ్యవసాయంతో తల్లినయ్యా!

అశ్వని

## 70 సెంట్ల నేలలో అద్భుతాలు సృష్టిస్తున్న అశ్విని

(కాట్రేనికోన-ఆంధ్రజ్యోతి)

కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన 32ఏళ్ల గెద్దాడి అశ్విని బీఏ, బీఈడీ చదివింది. ఆమెకున్నది కేవలం 20సెంట్ల నేల మాత్రమే. మరో 50 సెంట్లు కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేసి అద్భుతాలు సృష్టించింది. నేలను కాపాడుకుంటే... నేల మనల్ని కాపాడుతుందని అశ్విని అంటోంది. పంట మార్పిడి ద్వారా భూసారాన్ని రక్షించుకోవచ్చని నిరూపించింది. రైతులు ప్రకృతి సాగు విధానాలను అవలంబించాలని ఆమె కోరుతున్నారు. సేంద్రియ వ్యవసాయంపై నాగపూర్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఉత్తమ అవార్డు అందుకున్న అశ్వినితో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రకృతిని గుర్తించి వ్యవసాయం చేస్తే అంతా మేలే జరుగుతుంది. మాది వ్యవసాయ కుటుంబం. కేవలం 20 సెంట్లు నేల ఉంది. మరో 50 సెంట్లు కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాను. వరి, కాయగూరలు, ఆకు కూరలు.. ఇలా వివిధ రకాలు సాగు చేస్తుంటాను. 2019 నుంచి ఆర్గానిక్ సాగు మొదలుపెట్టాను. కషాయాలు, జీవామృతాలు వంటి సహజ పద్ధతులతో చీడపీడలు నివారణ, సేంద్రియ ఎరువుల ద్వారా భూసార పరిరక్షణ చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీస్తుంటాను. పంట మార్పిడిద్వారా నేల సారాన్ని పెంచుకుంటూ వస్తున్నాను. గట్లపై కాయగూరలు పండిస్తుంటాను. ఆకుకూరలు పెంచి విక్రయిస్తుంటాను. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో ఆకుకూరలు, కాయగూరలు పెంచడం అలవాటైంది. ప్రతి ఆదివారం కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆకుకూరలు, కాయగూరలు విక్రయిస్తాను. నాకు మూడేళ్ల పాప ఉంది. మా వారు కూడా వ్యవసాయమే చేస్తుంటారు. ఎప్పటికప్పుడు సేంద్రియ సాగులో ప్రయోగాలు, ఫలితాలపై డాక్యుమెంటేషన్ చేసి, వ్యవసాయాధికారులకు పంపుతాను. నాకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. అందుకు నాకు సహకరించిన ఈవీసీ విజయకుమార్, డీపీఎం లక్ష్మానాయక్, డివిజన్ ఇన్‌చార్జి రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ధన్యవాదాలు. మరి కొందరు రైతులను సేంద్రియ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాను.

> నాకు థైరాయిడ్, పీసీవోడీ సమస్యలున్నాయని... గర్భధారణ కష్టమని వైద్యులు తేల్చేశారు. అప్పుడు నా సమస్యను సేంద్రియ వ్యవసాయమే పరిష్కరించింది. సేంద్రియ సాగు ద్వారా పండించిన ఆహారం మాత్రమే తినడంవల్ల గర్భకోశ సమస్యలు పరిష్కారమయ్యాయి.

> "కుగ్రామంలో జన్మించింది. ప్రకృతిని నమ్మింది. నేలను సంరక్షించుకుంటే ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని నిరూపించింది. సత్ఫలితాలు సాధించింది. జాతీయ అవార్డు సాధించి చరిత్ర సృష్టించింది. జాతీయ సేంద్రియ ప్రకృతి వ్యవసాయ కేంద్రం, భారత ప్రభుత్వ వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఫిబ్రవరి 23, 24 తేదీల్లో నాగపూర్‌లో సేంద్రియ వ్యవసాయంపై జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో మొత్తం 15 జాతీయ పురస్కారాలు అందించగా అందులో ఏడు మన రాష్ట్ర రైతులకే దక్కడం విశేషం. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మహిళకు కూడా పురస్కారం దక్కింది."

- నేలను రక్షించి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం
- ఆరోగ్యంగా ఉండాలంటే భూమిని రక్షించుకోవాలి
- ప్రకృతి వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలి
- జాతీయ స్థాయి పురస్కార గ్రహీత అశ్విని పిలుపు




అశ్విని అందుకున్న జాతీయ అవార్డు, ప్రశంసాపత్రం






వరిచేల గట్లపై కూరగాయల సాగు



కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం వద్ద కూరగాయల స్టాల్‌లో అశ్విని



కేరళ స్ట్రైకర్స్, ఐబీ చెన్నై జట్ల క్రీడాకారుల మధ్య పోరు

# జోరుగా... హుషారుగా వాలీబాల్ పోటీలు

- పరిశీలించిన రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు
- టోర్నమెంటు నిర్వహణ తీరుపై ప్రశంసలు



ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి హైస్కూలు క్రీడా మైదానంలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం వాలీబాల్ కోర్టును పరిశీలించింది. పోటీల నిర్వహణ తీరుపై ఆటగాళ్లను, ప్రేక్షకులను అడిగి తెలుసుకుంది. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగొలకోటి ఫణీంద్రకుమార్‌తో అసోసియేషన్ సభ్యులు చర్చించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవిరాజు, కోశాధికారి బ్రహ్మాజీ టోర్నమెంటు నిర్వహణ తీరును ప్రశంసించారు. కాగా మొదటి మ్యాచ్ కేరళ స్ట్రైకర్స్, ఐబీ చెన్నై మధ్య నువ్వా... నేనా అన్న రీతిలో జరిగింది. బెస్ట్ ఆఫ్ ఫైవ్‌లో విజయం నిర్ధారించారు. 3-2 తేడాతో కేరళ స్ట్రైకర్స్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బెంగళూరు, జీఎస్టీ (ముంబయి) జట్ల మధ్య జరిగింది. వరుసగా మూడు సెట్లు గెలుచుకుని జీఎస్టీ విజేతగా నిలిచింది.



తలపడుతున్న జీఎస్టీ (ముంబై), బెంగళూరు జట్ల క్రీడాకారులు

# ఉత్సాహభరితంగా..

## ● ముగిసిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

- రెండువారాల పాటు కాకినాడలో కొనసాగిన పోటీలు
- పురుషుల విభాగంలో విజేత ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్
- మహిళల విభాగంలో విజేత ఒడిశా సెక్రటేరియట్



పురుషుల విభాగంలో : కాకినాడ క్రీడా మైదానంలో తలపడుతున్న హైదరాబాద్ వర్సెస్ ఢిల్లీ

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో రెండు వారాలుగా జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో పురుషుల విభాగంలో ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్ టీమ్, మహిళల విభాగంలో ఒడిశా సెక్రటేరియట్ టీమ్‌లు విజేతలుగా నిలిచాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఏపీ, తెలంగాణ రీజియన్ ఇన్‌కమ్ ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్, అర్జున, రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డుల విజేత, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధనరాజ్ పిళ్లై హాజరై విజేతలకు, రన్నర్ అప్ టీమ్‌లకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం ముఖ్య అతిథి ఆనంద్ రాజేశ్వర్ బైవార్ మాట్లా డుతూ తొలిసారి ఆతిథ్యం ఇచ్చి టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన కాకినాడ జిల్లా యంత్రాం గానికి అభినందనలు తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సాహంగా వచ్చి క్రీడా స్ఫూర్తితో ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులను అభినందిం చారు. క్రీడల్లో గెలుపోట ములు సహజమని, క్రీడలతో మంచి శారీరక ఆరోగ్యం, మానసిక ధృఢత్వం చేకూరుతుం దని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధనరాజ్ పిళ్లై మాట్లాడుతూ దేశంలో క్రికెట్ తరహాలో హాకీ క్రీడలకు క్రేజ్ లేనప్పటికీ యువత ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో సంతోషమన్నారు. హాకీ క్రీడాకారులు నిరంతరం ప్రాక్టీస్ చేసి తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, విశాఖపట్నం ఇన్‌కమ్‌టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు. పోటీలు ముగిసిన అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.




వేదికపై మాట్లాడుతున్న ఆనంద్ రాజేశ్వర్( డైరెక్టర్ ఆఫ్ లింగం ట్యాక్స్)



వేదికపై మాట్లాడుతున్న భారత హాకీ జట్టు మేనేజర్ ధనరాజ్ పిళ్లై



మహిళల విభాగంలో : ఒడిశా వర్సెస్ ఢిల్లీ



విజేతగా నిలిచిన ఒడిశా మహిళా జట్టు



మొదటి స్థానంలో నిలిచిన ఢిల్లీ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు



రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ అందుకుంటున్న ఢిల్లీ మహిళల జట్టు




సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

## టోర్నమెంట్‌లో విజేత జట్లు ఇవే..

మొదటి స్థానం: సెంట్రల్ సెక్రటేరియట్,
రెండో స్థానం: ఆర్ఎస్బీ హైదరాబాద్,
మూడోస్థానం: హర్యానా సెక్రటేరియట్
(పురుషుల విభాగం)

మొదటిస్థానం: ఒడిశా సెక్రటేరియట్,
రెండోస్థానం: సెంట్రల్ సెక్రటేరియట్,
మూడోస్థానం: హర్యానా సెక్రటేరియట్
(మహిళల విభాగం)

టోర్నమెంట్‌లో బహుమతులు పొందిన క్రీడాకారులు:

మహిళలు: రీతురాణా, జోనఫ్ ప్రధాన్, మౌనిక వైంగేడ్, కేఎల్ నాగలక్ష్మీ

పురుషులు: విశాల్‌సింగ్, ప్రమోద్, సూర్యప్రకాష్, దీపక్ సైనీ

బెస్ట్ టోర్నమెంట్ ఆఫ్ ది ప్లేయర్స్: వినయ్‌రాణా (సెంట్రల్ సెక్రటేరియట్), సోనికా(సెంట్రల్ సెక్రటేరియట్). దీనిలో భాగంగా వారికి ప్రశంసాపత్రాలు అందించారు.

## మూడో స్థానం కోసం రసవత్తర పోరు

మహిళల ఫైనల్స్: ఒడిశా సెక్రటేరియట్ జట్టు, సెంట్రల్ సెక్రటేరియట్ జట్లు తలపడగా ఒడిశా సెక్రటేరియట్ జట్టు 4-2 తేడాతో గెలుపొందింది. మహిళల మూడో స్థానం కోసం జరిగిన పోటీల్లో హర్యానా సెక్రటేరియట్ జట్టు, ఆం ధ్రప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు తలపడగా హర్యానా 4-2 తేడాతో గెలిచింది.


పురుషుల ఫైనల్స్: సెంట్రల్ సెక్రటేరియట్ జట్టు, ఆర్ఎస్బీ హైదరాబాద్ జట్లు తలపడగా సెంట్రల్ సెక్రటేరియట్ జట్టు 4-2 తేడాతో గెలిచింది. పురుషుల మూడోస్థానం కోసం జరిగిన పోటీల్లో హర్యానా సెక్రటేరియట్ జట్టు, ఒడిశా సెక్రటేరియట్ జట్లు తలపడగా హర్యానా సెక్రటేరియట్ 7-2 తేడాతో గెలిచింది.

# గోదావరిలో బోట్ రేస్


బోట్ రేస్‌లో పాల్గొన్న బోట్లు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28( ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి నదిలో బోట్ రేస్ అట్టహాసంగా జరిగింది. నదీజలాలపై అవగాహన కల్పించడానికి జాతీయ జలవనరుల శాఖ, జలశక్తి విభాగం, నదీసంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. దీనిని కమిషనర్ కేతన్ గార్గ్ జెండా ఊపి ప్రారంభించారు. పుష్కరాలరేవు ఎదురుగా ఉన్న గోదావరి లంక నుంచి 15 నావలు ఈ పోటీలో పాల్గొన్నాయి. లంక నుంచి పుష్కరాలరేవుకు ఈ రేస్ నిర్వహించారు. ఇంజన్ బోట్లు కాకుండా ఏతం వేసే బోట్లను పోటీలో దింపారు. సుమారు గంట పాటు జరిగిన పోటీలో ప్రథమ స్థానంలో నాతి పోసయ్య, ద్వితీయ స్థానంలో మల్లాడి సుబ్బన్న, తృతీయ స్థానంలో పోతాబత్తుల నాగరాజు నిలిచారు. ప్రథమ బహుమతిగా రూ25వేలు, ద్వితీయ బహుమతిగా రూ15వేలు. తృతీయ బహుమతిగా రూ10వేలు నగదును సాయంత్రం పుష్కరాలరేవులో జరిగిన ముగింపు కార్యక్రమంలో అందించారు. గోదావరి జలల పరిరక్షణ కోసం ఈ బోట్ రేస్‌ను ఏర్పాటు చేశామని కమిషనర్ చెప్పారు.


బోట్ రేస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్



## జనసేన ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు : మంత్రి నాదెండ్ల


జనసేన ఆవిర్భావ వేడుకల సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఇతర నేతలు

పిఠాపురం/పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం వేదికగా జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్‌లో మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ వేడుకల సభాస్థలిని ఆయన శుక్రవారం రాత్రి పరిశీలించారు. ప్రధాన వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీకి సూచనలు చేశారు. మహిళలు ఏ ఇబ్బంది లేకుండా నేరుగా సభాస్థలికి చేరుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది మంది పార్టీ శ్రేణులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సభ కారణంగా ఎవరికి ఇబ్బంది కలగకుండా చేయాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం అనంతరం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, జనసేన పిఠాపురం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, నాయకులు వై.శ్రీనివాస్, బోడపాటి శివదత్, తలాటం సత్య, మండలి రాజేష్, తోట సత్యనారాయణ, చల్లా లక్ష్మీ, మురాలశెట్టి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆవిర్భావ వేడుకల సభ నిర్వహణ ఏర్పాట్లుకు శనివారం సాయంత్రం 4గంటలకు భూమి పూజ జరగనున్నది.


## శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి : వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం విజ్ఞానం వైపు అడుగులు వేసే మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ వికసిత్ భారత్ కోసం సైన్స్ అండ్ ఇన్నోవేషన్-2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా మేధోపరమైన విజన్‌తో ముందుకు సాగాలన్నారు. మరో అతిథి కోస్తా ఆంధ్ర రేంజ్ డీఐజీ ఎం.ఆర్. రవికిరణ్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పినట్టు సినిమాను సినిమాలాగే చూడాలని, నిజజీవితంలో వాటిని అన్వయించుకోకూడదని చెప్పారు. ఈజీమని కోసం ఎవరూ ఆశపడకూడదని, అటువంటి వారు జైళ్లో మగ్గుతున్నారని చెప్పారు. గంజాయి మత్తులో తల్లిదండ్రులను చంపిన వారు జైళ్లల్లో ఉన్నారని, గంజాయి సంబంధిత సమాచారాన్ని 1972 నెంబరుకు తెలియజేయాలన్నారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త చంద్రశేఖరం మలపాక ప్రతీ ఏడాది సైంటిఫిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులపై చర్చలు జరగాలని చెప్పారు. అనంతరం ఆచార్య మురళీకృష్ణ, కె.నూకరత్నం రాసిన స్పాటియల్ అనాలసిస్ అండ్ జియో విజువలైజేషన్ పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ధృవపత్రాలను అందజేసారు. కెమిస్ట్రీ విద్యార్థి బద్రి వేసిన సర్ సీవీరామన్, అబ్దుల్ కలామ్ చిత్రపటాలను వీసీ ఆవిష్కరించి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత నన్నయ విగ్రహానికి, సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


రామన్ చిత్రపటానికి, నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వీసీ, అతిథులు



## కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కామన


కామన ప్రభాకరరావు

మండపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదకు చెందిన ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావును నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మండపేట ఏడిద రోడ్డులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను 40 ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో పనిచేస్తున్నానని.. తనపై ఎంతో నమ్మకంతో కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యలపై రాష్ట్ర పర్యటన త్వరలోనే జరుగుతుందని, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని కలిసిన తర్వాత ఉత్తరాంధ్ర నుంచి రైతు సమస్యలపై పోరాటం ఉంటుందని ఆయన చెప్పారు.

## కనుల పండువగా కుక్కుటేశుని తెప్పోత్సవం

వైభవంగా శ్రీపుష్పోత్సవం, ముగిసిన కల్యాణోత్సవాలు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో హంస వాహనంపై కుక్కుటేశుని తెప్పోత్సవం, బాణసంచా కాల్పుల దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో భక్తుల శివనామస్మరణ మధ్య కుక్కుటేశుడు అమ్మవారితో కలిసి హంసవాహనంపై విహరించారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు కుక్కుటేశుని తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికంగా తరలి వచ్చారు. పాదగయలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా కుక్కుటేశ్వరస్వామికి ఉదయం స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చనలు జరిగాయి. స్వామి, అమ్మవారికి త్రిశూల స్నానం జరిపించారు. రాత్రి పదిగంటలకు శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు విశేష అలంకరణ చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. అనంతరం ఏకాంతసేవాగానం జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

### ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా కాల్పులు

పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ కాల్చిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో రథాన్ని ఉప్పాడ సెంటర్‌లో నిలిపిన అనంతరం 4 గంటల పాటు బాణసంచా కాల్చారు. మిరుగొట్లు గొలిపే బాణసంచా కాల్పులను తిలకించేందుకు భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు.

## భీమేశ్వరునికి త్రిశూల స్నాన పూజలు


పుష్కరిణిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సామర్లకోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరునికి త్రిశూల స్నాన పూజలు శుక్రవారం వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పండితులు సోమేశ్వరశర్మ నేతృత్వంలో చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆలయ పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. త్రిశూల స్నానం, తీర్థపుసేవ పూజలు నిర్వహించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని
# ఇద్దరు యువకుల దుర్మరణం


మరణించిన ఆకాష్‌రెడ్డి, జయఅభినవ్ (ఫైల్‌ఫొటోలు)

ఐ.పోలవరం/ముమ్మిడివరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం 216 జాతీయ రహదారిపై పాతయింజరం పోలీసుస్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. యానాం నుంచి స్పోర్ట్స్ బైక్‌పై వస్తున్న వారిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులిద్దరూ ముమ్మిడివరం మండలానికి చెందిన వారు కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాధ చాయలు నెలకొన్నాయి.

మృతులలో ఒకరు ముమ్మిడివరం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధికి చెందిన దొమ్మేటి జయఅభినవ్ (17) కాగా మరొకరు కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని బూరుగుపేటకు చెందిన మాట్టా ఆకాష్‌రెడ్డి (21). దొమ్మేటి అచ్యుత వీరవెంకటసత్యనారాయణ-సరోజిని దంపతులకు దొమ్మేటి జయఅభినవ్ ఏకైక సంతానం. పదోతరగతి వరకు చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. లేకలేక కలిగిన సంతానం ఒక్కగానొక్క కుమారుడు. అభినవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు రోధిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడన్న సంగతిని జీర్ణించుకోలేకపోతున్నారు. మట్టా రాహుల్-సుభాషిణి దంపతుల పెద్ద కుమారుడు మట్టా ఆకాష్‌రెడ్డి. డిప్లమో చేసి ప్రస్తుతం ముమ్మిడివరంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. చేతికంది వచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతకు గురవ్వడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఐ.పోలవరం పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతదేహాలను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.


రోడ్డుపై మృతదేహాలు

### ధర్మవరంలో వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరానికి చెందిన రాయి నూకరాజు హైస్కూలు రోడ్డు జంక్షన్‌లో హైవే దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలవరం ముంపు నుంచి ఆదుకోవాలి

వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం వాసుల ఆందోళన


ధవళేశ్వరం పోలవరం భూ సేకరణ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వడ్డిగూడెం వాసులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ముంపు నుంచి ఆదుకోవాలని, తమను నిర్వాసితులుగా గుర్తించి పునరావాసం కల్పించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం భూసేకరణ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆందోళన చేశారు. స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళావందనంకు వినతిపత్రం అందజేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఐఏఎస్ అధికారి వి.అభిషేక్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా వీఆర్‌పురం గ్రామం బీసీ కాలనీ వాసులమని, గత 60 ఏళ్లుగా వడ్డిగూడెం పంచాయతీలో ఇంటిపన్నులు చెల్లిస్తున్నామన్నారు. అయితే తమ ఇళ్లు ఇతర భూములు రేఖపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్నాయంటున్న అధికారులు ఆ కారణంతో తమ కాలనీలో ఉన్న 209 కుటుంబాలను ముంపు బారిన పడుతున్నట్టు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కాలనీ పరిధిలో 209 కుటుంబాలు ఉండగా 111 కుటుంబాలు లేడార్ సర్వేలో ఉన్నాయని మిగిలిన 98 కుటుంబాలు లేడార్ సర్వే కుటుంబాల్లో లేవని అధికారులు చెబుతున్నారని అయితే గోదావరి వరదలు వస్తే మొత్తం గ్రామం అంతా మునిగిపోతుందని ఫోటోలు ప్రదర్శించారు.

రేఖపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధం లేకుండా వీఆర్‌పురం బీసీ కాలనీలో ఉన్న 209 కుటుంబాలను ఒకే యూనిట్‌గా 41.15 కాంటూరులో చేర్చి ముంపు ప్రాంతంగా గుర్తించి గ్రామసభలో తీర్మానించాలని కోరారు. స్ట్రక్చర్ వాల్యూ సర్వే చేయించాలని అధికారులను కోరారు. కాలనీలో కొంతభాగం ముంపు ప్రాంతంగా, మరికొంత భాగాన్ని ముంపు బారిన పడని ప్రాంతంగా గుర్తించడం తగదని పోలవరం పూర్తయితే శాశ్వతంగా ముంపునకు గురవుతామని ప్రభుత్వం చొరవతో పునరావాసం కల్పించాలని కోరారు.

## నేటి నుంచి కొత్త మోటార్ వెహికిల్ చట్టం అమల్లోకి

లైసెన్సు లేకపోతే రూ.5వేలు

సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్‌కు రూ.10వేలు జరిమానా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)




శనివారం నుంచి కేంద్ర ప్రభుత్వం కొత్త మోటారు వెహికిల్ చట్టం 'న్యూ సెంట్రల్ మోటార్ వెహికిల్ యాక్ట్-1988(సవరణ 2019)' అమల్లోకి తీసుకొస్తోంది. దీని ప్రకారం నిబంధనలు కఠినంగా ఉంటాయి. జరిమానాలు రూ.వెయ్యి నుంచి ప్రారంభమవుతాయి. డ్రైవింగ్ లైసెన్సు రద్దుకూ వెనుకాడరు. ఇలా ఒకసారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తే మళ్లీ పునరుద్ధరించడం చాలా కష్టమైన పని. లైసెన్సు లేకపోతే రూ.5వేలు, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్‌కు రూ.10వేలు జరిమానా విధిస్తారు. మార్చి 1 నుంచి నూతన చట్ట ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి తీరాల్సిందేనని చెప్పారు. వాహనాలను ఆల్ట్రేషన్ చేయడం, ఇష్టానుసారం నంబరు ప్లేట్లు వేసుకోవడం, అసలు నెంబరు లేకుండా పేరు రాసుకోవడం, నవ్యంగా డ్రైవంగ్ చేసే వారికి కూడా ఇబ్బంది కలిగే విధంగా, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం, నంబరు ప్లేట్లు లేకపోవడం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. హెల్మెట్ లేకపోతే చలానాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ద్విచక్రవాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, ఇద్దరికీ హెల్మెట్లు ఉండాలన్నారు. రాజమహేంద్రవరం నగరంలో ట్రాఫిక్ సీఐలు మహమ్మద్ నబీ, చింతా సూరిబాబు సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేపడతారని చెప్పారు. కొత్త చట్ట ప్రకారం చలానాలు విధించడమే కాకుండా అక్కడికక్కడే జరిమానా కట్టించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు చిక్కుల్లో పడతారన్నారు.

## డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచి విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజ్ నుంచి తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంటకాలువకు 1720 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 4600 క్యూసెక్కులు, 8970 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8328 క్యూసెక్కులుగా ఉండగా, ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.05 అడుగులుగా నమోదైంది.

## సత్యనారాయణస్వామి ఆలయంలో చోరీ

8కిలోల వెండి

ఆభరణాలు అపహరణ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నవరప్పాలెం శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో దొంగలు పడి 8 కిలోల వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. ఆలయ పూజారి దొంతికుర్తి శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు వెళ్లారు. అప్పటికే తలుపులు తెరచి ఉండడాన్ని గుర్తించి స్థానిక పెద్దలు, అధికారులకు సమాచారం అందించారు. తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, పట్టణ సీఐ పి.వీరబాబు, తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయానికి ఉన్న నాలుగు ప్రధాన ద్వారాల తాళాలను పగులకొట్టి గర్భాలయంలోని 8కిలోల వెండి ఆభరణాలను చోరులు అపహరించుకుపోయినట్టు గుర్తించారు. అప్పటికే క్యూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వేలిముద్రలను సేకరించారు. ఆలయం వద్ద నుంచి డాగ్‌స్క్వాడ్ కిలోమీటరు దూరంలో ఉన్న కేతావారిపాలెం వరకు వెళ్లి అక్కడ ఆగిపోయింది. ఆలయ పూజారి దొంతికుర్తి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఎవరైనా దొంగతనానికి పాల్పడ్డారా లేక బయటి నుంచి దొంగలు వచ్చారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆలయంలో మిగిలిన వెండి ఆభరణాలు, బంగారు ఆభరణాలు యథావిధిగానే ఉన్నాయని ఆలయ పూజారి, గ్రామపెద్దలు తెలిపారు.


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐలు వీరబాబు, గజేంద్రకుమార్

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

### తంటికొండ వెంకన్నకు అభిషేకం

గోకవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంటికొండ గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంక టేశ్వరస్వామికి శుక్రవారం పంచనదుల జలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రయాగ్, పుష్కరిణి, త్రివేణి సంగమం తీర్థ సహిత కృష్ణ, గోదావరినదీ జలాలతో అభిషేకాలు చేశారు. భక్తులు హాజరై ప్రసాదాలను స్వీకరించారు.


కడియం ఉన్నత పాఠశాలలో సైన్సు దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

# మానవ అభివృద్ధికి సైన్స్ దోహదం

**ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం**

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు తరాలు మనుగడ సాధించగలుగుతాయని జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు వై.ఫైడియ్య అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ విషయంలో బాధ్యతగా ఉండాలని పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం జనవిజ్ఞాన వేదిక తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆనంద్‌నగర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. అధ్యక్షుడు భీమయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.రవిబాబు మాట్లాడుతూ సైన్స్ మానవ అభివృద్ధికి ఎంతో దోహదపడిందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెక్క తాతారావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.రవికుమార్, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలి**

**అనపర్తి:** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ దినోత్సవం ఉపకరిస్తుందని అనపర్తిలోని రామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి అన్నారు. శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు వులగం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు బీవీ నాయక్, వి.శ్రీనివాస్, మురళీమోహన్, శివయ్య, మహాలక్ష్మి, లలితకుమారి పాల్గొన్నారు,

**ఆకట్టుకున్న సైన్సు ముగ్గులు, ప్రాజెక్టులు**

**బిక్కవోలు:** మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వేసిన సైన్సు ముగ్గులు, తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. పందలపాక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సైన్సు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా సర్ సీవీ. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పీవీ సత్యనారాయణ, పీడీ యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పీవీ ప్రభాకరరావు, ఊలపల్లిలో హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఇల్లపల్లిలో హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

**దివాన్‌చెరువు:** రాజానగరం మండలంలోని పాతతుంగపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సైన్స్‌దినోత్సవం ప్రాముఖ్యతగురించి ప్రధానోపాధ్యాయులు బి.ఆర్.కమలాదాస్ విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గోకవరం**: ఫార్మసీ విద్యార్థులలో పరిశోధన సంస్కృతిని పెంపొందించడం, ప్రజారోగ్యాన్ని మెరుగు పర్చగల ఔషధ రంగాన్ని అభివృద్ధి చేయగల కొత్త ఔషధ ఉత్పత్తులు, పరిష్కారాలకు దోహదపడేలా వా రిని ప్రోత్సహించడం జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్ర మ ప్రాథమిక లక్ష్యమని ఆదర్శ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ త్రినాధ్‌రావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం.వి.రామకృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను రామకృష్ణారావు అందజేశారు. కళాశాల కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**కడియం:** కడియం ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్సు విభాగం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రఫీయుద్దీన్ అధ్యక్షతన జాతీయ సైన్సు దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన అంశాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ ఉపా ధ్యాయులు కె.రాజు, నాగమణి, రత్నకిరీటిలు మాట్లాడారు. షేక్ సిరీన్, ఎస్ కుసుమ, కే గీతాశ్రీహాన్విత, సీహెచ్ వైష్ణవి, వంగా వైష్ణవి, హర్షిత్ తదితరులు తయారు చేసిన అంశాలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

**రాజానగరం :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండ లంలోని పలు విద్యాసంస్థలు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కానవరంలోని గాయత్రి విద్యాసంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా సైన్సు ప్రాజెక్టును రూపొందించారు. ఈసందర్భంగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వీవీ ఎస్ఎన్ మూర్తి విద్యారులు తయారు చేసిన ప్రాజెక్టులను వీక్షించారు.

● గైట్ డిగ్రీ కళాశాలలోని హెచ్‌బీఎస్ ఫోరెన్సిక్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టర్బో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ మేనేజర్ ఆర్.మురళి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మానవ జీవితాలపై సైన్సు ఎంతో ప్రభావం చూపిందన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతు లు అందజేశారు. టర్బో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంతీయ హెచ్‌ఆర్ పి.నటరాజన్, కన్వీనర్లు ఎం.సావిత్ర, డి.నగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**శ్రీ చైతన్యలో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన**

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్ర జ్యోతి): భవిష్యత్తులో ప్రభుత్వ ఉన్నత పదవుల ను సాధించాలంటే సామాజిక చైతన్య మూ ర్తిత్వం, నైపుణ్యాలు అవసరమని అడిషనల్ ఎస్పీ ఎన్‌వీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు. మోరంపూడి శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. దీనికి అడిషనల్ ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడు తూ.. విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన నిర్వహణ భావి భారతాన్ని నిర్దేశిస్తుందన్నారు. ఆర్ఐ ఉదయ్ శంకర్ మా ట్లాడుతూ మరెన్నో కొత్త ప్రాజెక్టులు చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఏజీఎం సురేశ్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి అభి నందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీ సౌజన్య, కో-ఆర్డినేటర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఆవరణలోని సీవీ రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చీఫ్ సైంటిస్ట్ కె.చంద్రశేఖరనాయుడు మాట్లాడుతూ సైన్స్ రంగానికి సీవీ రామన్ చేసిన సేవలు అనిర్వచనీయమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలకు బహుమతులు అందజేశారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఇతర సైన్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రంగంపేట:** బాల్యం నుంచి శాస్త్రీయ వైఖరిని పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి సూచించారు. రంగంపేట హైస్కూల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో 70 ప్రాజెక్టులను విద్యారులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు కె.వరలక్ష్మీ, వి.రమ్యసుధ,కె.ఓంప్రసాద్, ఎం.సత్యదేవి, ఐఎఎస్ భారతిల కృషిని ఆయన అభినందించారు.

**సీతానగరం:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీతానగరం డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ డీవీ రామన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గణిత శాస్త్ర అధ్యాపకులైన ప్రిన్సిపాల్ చిట్టిబాబును ఘనంగా సత్కరించారు.


విజ్ఞాన ప్రదర్శన తిలకిస్తున్న అడిషనల్ ఎస్పీ

## ప్రజలకు వెన్నుదన్నుగా రాష్ట్ర బడ్జెట్

● మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 2025-26 రాష్ట్ర బడ్జెట్ రూ3.22 లక్షల కోట్లతో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజలకు వె న్నుదన్నుగా నిలిచింది. రాష్ట్ర పునః నిర్మాణం, అభివృద్ధి సంక్షేమానికి ఊత మిచ్చేలా బడ్జెట్ కేటాయింపులు చే యడం అభినందనీయం, బీసీ సంక్షేమానికి రూ47,456 కోట్లు, ఆదరణ పథకం కోసం రూ. వెయ్యికోట్లు కేటాయించడం శుభపరిణామం. పోలవరం, అమరావతి అభివృద్ధి, గృహనిర్మాణ రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. బడ్జెట్ చాలా బాగుంది.

### సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్‌పై హర్షం

● నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు



సెలూన్లకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందించేలా రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో పొందుపర్చడం చాలా ఆనందంగా ఉంది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని నిరూపించింది. ఉచిత విద్యుత్‌ను సెలూన్ షాపులకు వర్తించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### సామాజిక రంగాలకు న్యాయం జరగలేదు


● సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



రాజమహేంద్రవరం అర్బన్ : రాష్ట్ర బడ్జెట్‌లో కీలకమైన విద్య, వైద్యం తదితర సామాజిక రంగాలను విస్మరించారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మదు విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ఆయన స్పందించి ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడింది. కౌలు రైతులకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. పోలవరం జాతీయ ప్రాజెక్టును మినహాయిస్తే వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేశారు.

### భవిష్యత్తరాలకు మంచి చేసే బడ్జెట్

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్



కూటమి ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్ భవిష్యత్ తరాలకు మంచిచేసేదే, అన్నిరంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యావ్యవసా యం, సంక్షేమం, పరిశ్రమలు, మౌళిక సదుపాయాలు ప్రాధాన్యమిచ్చారు. వ్యవసాయం రంగానికి రూ48,341 కోట్లు కేటాయించారు.




డీపీఆర్వో ఐకా కాశయ్య దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

## డీపీఆర్వో కాశయ్య ఉద్యోగ విరమణ

● ఘనంగా సత్కరించిన కలెక్టర్, జేసీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సమాచార పౌరసంబంధాలశాఖ డీపీఆర్వోగా విశేషమైన సేవలు అందించిన ఐకా కాశయ్యను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.చిన్నరాముడులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం కాశయ్య పదవీ విరమణ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లో కాశయ్య కనకదుర్గ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వానికి సమాచార సాధనాలకు వారధిగా నిలిచి ప్రజలకు సత్వర సమాచారం అందించడంలో కీలక భూమికను కాశయ్య పోషించారని అభినందించారు. విశ్రాంత జీవితమంతా ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కాశయ్యసేవలను జేసీ చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తిలు ప్రసంశించారు. తొలుత రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనంకళాకేంద్రం సర్వరాయ కళామందిరంలో సమాచారశాఖ సిబ్బంది. రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సభ్యులు కలిసి వీడ్కోలు సభను నిర్వహించారు. కాశయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారధి, గౌరవా ధ్యక్షుడు మండేలా శ్రీరామ్మూర్తి, సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్, కేవీ శైలేంద్ర, అప్పలనా యుడు, జిల్లా పౌరసమాచార అధికారి సీహెచ్ శ్రీనివాసు, డీపీఆర్వోలు లక్ష్మణాచార్యులు, కాశయ్యకుటుంబ సభ్యులు, సీనియర్ పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు,అమలాపురం డీపీఆర్వో రెడ్డి, రాజమహేంద్రవరం, రంపచోడవరం, సమాచారశాఖ ఉద్యోగులు,రిటైర్డ్ డీపీఆర్వోలు ఆలీ, సాయిబాబా పాల్గొన్నారు.

## 111 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద

● రూ.27.93 కోట్ల ఇంటి పన్నుల వసూళ్లు
● డీఎల్‌పీవో నాగలత


జేగురుపాడులో పర్యటించిన డీఎల్‌పీవో నాగలత

కడియం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోగల 146 గ్రామ పంచాయతీలకుగాను 111 పంచాయతీలలో చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్వహిస్తామ ని డీఎల్‌పీవో నాగలత తెలిపారు. మిగిలిన పంచాయతీల్లో షెడ్ నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. శుక్రవారం జేగురుపాడు, పొట్టిలంక గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. పలు ఫిర్యాదులపై విచారణ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో నాగలత మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణకు ముమ్మర చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్‌వీ రామ్‌ప్రసాద్, జేగురుపాడు కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు, పొట్టిలంక కార్యదర్శి అమీర్‌షరీఫ్ ఉన్నారు.

● రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో గల పంచాయతీలు 24-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటివరకు రూ.27.93కోట్ల ఇంటిపన్నుల వసూళ్లు చేసినట్లు డీఎల్‌పీవో ఎం.నాగలత తెలిపారు. డివిజన్ పరిధిలో గల రాజమహేంద్రవరంరూరల్, కడియం, రాజానగరం, కో రుకొండ, సీతానగరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, గోకవరం మండలాల్లో 146 పంచాయతీల్లో రూ.67.58 కోట్ల ఇంటిపన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 41 శాతం వసూలు కాగా నూరుశాతం వసూళ్లకు గ్రామ కార్యదర్శులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రూ.39.65 కోట్లు ఇంటి పన్నులు వసూళ్ల కావాల్సి ఉందన్నారు. మార్చి 15 నాటికి నూరుశాతం పన్నులు వసూళ్లకు తగినచర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంటి యజమానులు కూడా పన్నులు చెల్లింపునకు సహకరించాలని కోరారు.

## ఫీల్డు ఆపరేటర్ల శ్రమను దోచుకుంటున్న ఓఎన్జీసీ యాజమాన్యం

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి) : ఓఎన్జీసీ యాజమాన్యం ఫీల్డు ఆపరేటర్ల శ్రమను దోచుకుంటున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ ఆరోపించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె నోటీసు జారీ చేస్తామని ఫీల్డు ఆపరేటర్స్ జేఏసీ కన్వీనర్ వి.శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం ఫీల్డు ఆపరేటర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ గేటు వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణ్ పాల్గొని సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల్లో నవరత్నాలుగా పేరొందిన వాటిలో ఓఎన్జీసీ ఒకటని, అటువంటి సంస్థలో ఆయిల్ నిక్షేపాలు వెలికితీసే కీలకబాధ్యతలను నిర్వర్తించే ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారని అన్నారు. తమను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేస్తే యాజమాన్యం దాన్ని పక్కనబెట్టి నాలుగు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ విధానం తీసుకొచ్చి ఉద్యోగభద్రత దూరం చేశారని విమర్శించారు. స్కిల్డ్ వర్కు చేయించుకుంటూ అన్‌స్కిల్డు జీతాలు చెల్లిస్తున్నారన్నారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ తక్షణమే చేయాలని ఫీల్డు ఆపరేటర్స్ జేఏసీ కన్వీనర్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నాయకులు డీఎస్ఆర్‌వీ సుబ్రహ్మణ్యం, ఎస్‌కే అహ్మద్, ఆలీషా, సీఐటీ యూ నాయకులు పవన్, పూర్ణిమరాజు పాల్గొన్నారు.

## నదీజలాలను పరిరక్షించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలి

● నగర పాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28( ఆంధ్రజ్యోతి): నదీజలాలను పరిరక్షించే కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. కేంద్ర జలవనరులశాఖ జలశక్తి విభాగం, నదీజలాల పరిరక్షణ సంస్థ సూచనల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాజహేంద్రవరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6నుంచి 8గంటల వరకు యోగా కార్యక్రమలు చేశారు. శరీరానికి యోగం ఎంతో మంచిదని కమిషనర్ చెప్పారు. అనంతరం నగరంలో 13 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు వైజంక్షన్ నుంచి విద్యార్థులతో ర్యాలీ చేశారు. అనంతరం పుష్కరాలరేవులో సాయంత్రం 6నుంచి రాత్రి 9గంటలవరకు సంస్కృతిక కార్యక్రమాలు, విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. తొలుత కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నదీ జలాలు కలుషితం కాకుండా ప్రజలు సంరక్షించాలని, ప్రభుత్వం నీటిశుద్ధి కోసం మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని అదనంగా రూ.95 కోట్లతో 50, 60 ఎంఎల్‌డీ సామర్థ్యంతో జాతీయ నదీ సంరక్షణ సంస్థ నిధులతో చేపట్టామని ఈ ఏడాదిలో పూర్తి చేస్తామని తెలిపారు. సాయత్రంం వివిధ నృత్యకళాక్షేత్రాల నుంచి కళాకారిణీలు నృత్యప్రదర్శనలు చేశారు. అదేవిధంగా పుష్కరాలరేవులో నిర్వహించిన గోదావరి మాతకు నిత్యహారతి ప్రత్యేకంగా తిలకించారు. జలసంరక్షణపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి రామలింగేశ్వర్, డిప్యూటి కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్షాఆలీ, మేనేజరు ఎండి అబ్దుల్ మాలిక్ అన్సర్, కమండ్ కంట్రోల్ రూమ్ హెడ్ రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

### సీతానగరం కళాశాలను పరిశీలించిన ఎస్పీ

సీతానగరం, ఫిబ్రవరి 28: సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు కోరుకొండ సీఐ వైసత్యకిషోర్, ఎస్ఐ డి.రామ్‌కుమార్ పరిశీలించారు. శనివారం ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షల నిమిత్తం సీతానగరం జూనియర్ కళాశాలను పరిశీలించి లెక్చరర్లుకు పలు సూచనలు చేశారు. అనంతరం సిఐ సత్యకిషోర్ మాట్లాడుతూ పరీక్షా సెంటర్ పరిధిలో 144సెక్షన్ సక్షన్ అమలులో ఉందన్నారు.

### 'టీబీ రహిత గ్రామాలే లక్ష్యం'

రంగంపేట,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీ రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, జిల్లా క్షయ లెప్రసీ ఎయిడ్స్ అధికారిణి ఎస్.వసుంధర అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వెరిఫికేషన్ టీమ్ శుక్రవారం రంగంపేట మండలంలో పర్యటించారు. చంద్రేడు సిల్వర్ మెడల్‌కు పెదరాయవరం, కోటపాడు,వెంకటాపురం, ముకుందవరం, వీరంపాలెం, ఈల కొలను సచివాలయాలు బ్రాంజ్ మెడల్‌కు ఎంపికయ్యారన్నారు.

## రేషన్ సరుకులకు ఎక్కువ ధర వసూలు చేస్తే చర్యలు

● సమావేశంలో ఇన్‌చార్జి పౌరసరఫరాల అధికారి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లు కొంతమంది రేషన్ సరుకులకు కార్డుదారుల నుంచి ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇలాంటి అక్రమాలకు పాల్పడినా, నిబంధనలు అతిక్రమించినా ఎండీయూ ఆపరేటర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాల అధికారి ఎం.నాగాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తూర్పుగోదావరి జిల్లాలోని ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైస్‌కార్డుదారునకు రేషన్ సరుకులు అందించాలని, ప్రతి ఇంటికీ ఎండీయూ వాహనం వెళ్లాలని అన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఫిర్యాదులు అందిన ఎండీయూ ఆపరేటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### నేర తీరు మార్చుకోని వ్యక్తిపై పీడీ యాక్టు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తిపై పీడీ యాక్టు అమలు చేశామన్నారు. అల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలోని అనపాలవారి వీధికి చెందిన యర్రా గణేశ్(గంజిగాడు)కి ఎన్నిసార్లు కౌన్సెలింగ్ చేసినా తన నేర ప్రవృత్తిని మార్చుకోలే దన్నారు డెకాయిటీ, దోపిడీ, గంజాయి తదితర 15క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. స్థానికంగా ప్రమా దకరమైన వ్యక్తిగా చలామణీ అవుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని చెప్పారు. వైఖరి మారకపోవడంతో సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ద్వారా టూటౌన్ సీఐ మంగాదేవి అతడిపై పీడీ యాక్టు అమలుచేయడానికి ప్రతిపాదనలు తనకు పంపగా ఆ మేరకు కలెక్టరుకు సిఫార్స్ చేశామన్నారు. కలెక్టరు, జిల్లా మేజిస్ట్రేటు అను మతితో గణేశ్‌పై పీడీ యాక్టు అమలు చేశామని ఎస్పీ పేర్కొన్నారు.

### చలో పిఠాపురం జనసైనిక రా కదలిరా

కోరుకొండ,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మార్చి 14వ తేదీన పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున జనసైనికులందరూ కదలిరావాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రాజానగరం నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే తూర్పుతీరం రమ్మంటుందంటూ గ్రా మాల్లో పోస్టర్లు వెలిశాయి. జనసేన సింహగర్జన్ 2025 జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలో పాల్గొనేందుకు రాజానగరం నియోజకవర్గం నుంచి వందలాదిగా బస్సులు, కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లి బహిరంగ సభను జయప్రదం చేద్దామంటూ బత్తుల పిలుపునిచ్చారు.

### నన్నయ్య వీసీకి సత్కారం

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నన్నయ్య వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఎస్.ప్రసన్నశ్రీని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కుసుమ సాయిబాబా, గౌరవ అధ్యక్షుడు బి.జార్జ్ అంటోని, వ్యవస్థాపకుడు డీఆర్ఎస్ ఠాగూర్‌లు సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ డిరాజు, జాయింట్ సెక్రటరీ కే శ్యాంకుమార్, కోశాధికారి కె ఆశాలత తదితరులు పాల్గొన్నారు.





# నిమిషం ఆలస్యమైనా నో

- నేటి నుంచి సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు
- రెండేళ్లు 43,754 విద్యార్థులు.. 51 కేంద్రాలు
- 9 గంటలకు పరీక్ష..8.30 గంటలకే హాజరవ్వాలి
- కంట్రోల్ రూమ్ నెంబర్ 0883 2473430
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

## ఇంటర్ పరీక్షకు అనుమతి నిరాకరణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం (నేడు) నుంచి పకడ్బందీ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూంలో ఫోన్ నెంబరు 0883 2473430ని ఏర్పాటు చేశారు. ఉదయం సరిగ్గా 9 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు ముగుస్తుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షలు నిర్వహించే 51 కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతున్నారు.మొదటి ఏడాది జనరల్ 20,591, ఒకేషనల్ 2,226, రెండో ఏడాది జనరల్ 19,062, ఒకేషనల్ 1,875 కలిపి మొత్తం 43,754 మంది విద్యార్థులు హాజరవుతారని ఇంటర్ విద్య ప్రాంతీయ పర్యవేక్షకులు ఎన్ఎస్వీఎల్.నరసింహం తెలిపారు. విద్యార్థులు సమయానికి గమ్యానికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు సరఫరాలో అంతరాయం కలగడానికి వీల్లేదన్నారు. ఫ్యాన్లు, సరిపడా లైటింగ్ ఉండేట్లు చూడాలని ఆదేశించారు.హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తారసపడితే వారిని పరీక్షా కేంద్రం వద్దకు చేర్చడానికి వాహన దారులు..ఆటోవాలాలు ఉదారంగా వ్యవహరించాలి. అలాంటి విద్యార్థులను పరీక్షా కేంద్రం వద్దకు తీసుకెళ్లి పెద్ద మనసు చాటుకోవాలి. దివ్యాంగులకు అయితే కచ్చితంగా సహాయం చేయాల్సిందే.

### కలిసొచ్చిన సెలవులు..

ప్రథమ ఏడాది విద్యార్థులకు మార్చి 1న లాంగ్వేజీ, 4న ఇంగ్లీషు, 6న లెక్కలు-1ఏ, బోటనీ, సివిక్స్, 8న లెక్కలు-1బీ, జువాలజీ, హిస్టరీ, 11న ఫిజిక్స్ఎకనామిక్స్, 13న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్.17న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్స్ మ్యాథ్స్, 19న మోడరన్ లాంగ్వేజీ, జియోగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తారు.అవే సబ్జెక్టులు రెండో ఏడాది విద్యార్థులకు మార్చి 3, 5, 7, 10, 12, 15, 18, 20 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల మధ్య సమయం ఎక్కువగా ఇచ్చారు.1న లాంగ్వేజ్ పరీక్ష జరిగితే 2, 3 సెలవు. 4న ఇంగ్లీషు పరీక్ష ఉంది. అలాగే ప్రథమ,ద్వితీయ ఏడాది విద్యార్థులకూ ప్రతి సబ్జెక్టుకూ రెండు రోజుల సమయం ఉంది.కాబట్టి ప్రశాంతంగా సిలబస్ రివిజన్ చేసుకుంటే సరిపోతుంది. సైడ్ హెడ్డింగ్‌లు, ఫార్ములాలు గుర్తు పెట్టుకుంటే సగం జవాబు వచ్చినట్లేనని అంటున్నారు.

### పటిష్ట బందోబస్తు

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు చుట్టపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కేసులు తప్పవన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై దృష్టి సారించామని చెప్పారు.

## హాకీలోనూ.. సివిల్ పవర్ చూపారు!

చదువుల్లోనే కాదండోయ్.. ఆటల్లోనూ తగ్గేదేలే అన్నారు.. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు వారాలుగా హోరా హోరీగా సాగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. పోటీల్లో భాగంగా మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఒడిశా సెక్రటేరియట్ టీమ్‌కు ట్రోఫీ అందజేసి అభినందించారు.



## గోదావరిలో.. తలపడ్డారు!

బైక్ రేస్ తెలుసు.. కార్ రేస్ తెలుసు.. మరి బోట్ రేస్ గురించి ఇప్పటివరకూ ఎక్కడైనా విన్నారా.. చూశారా.. విని ఉంటారు కానీ చూసి ఉండరు.. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం బోట్ రేట్ సాగింది.. సుమారు 15 పడవలు వేసుకుని హోరాహోరీగా ఇలా తలపడ్డారు.. ముగ్గురు విజేతలుగా నిలిచారు.





# సంక్షేమ.. పద్దు పొడుప్పు!

సంక్షేమంలో 'పద్దు' పొడిచింది. పయ్యావుల పద్దు సంక్షేమం, అభివృద్ధి మంత్రం జపించింది. అన్ని వర్గాల ను లక్ష్యంగా చేసుకుని వరాల వాన కురిపించింది. మహిళలను మురిపించి.. అన్నదాతలను మెప్పించి... పేదలకు ధీమా కల్పిస్తూ బడ్జెట్ పద్దు బహుబాగు అనిపించింది. పేదలకు ఆరోగ్య ధీమా కల్పించింది. ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నట్టు ప్రకటించి ధైర్యం ఇచ్చింది.. ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు శ్రీకారం చుట్టేలా పద్దులో కేటాయింపులు చేసింది.. - (కాకినాడ/ఆంధ్రజ్యోతి)

## కూటమి సూపర్ బడ్జెట్

## మురిపించేను

### బీమా...ఆరోగ్య ధీమా..

పేద వర్గాలకు ఆరోగ్యపరంగా ధీమా కల్పించేందుకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని పేదలకు అమలు చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో రూ.19,264 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ప్రకటించిన రూ.25 లక్షల ఆరోగ్య బీమా పేదల జీవితాలకు మేలి మలుపే. ఈ బీమాతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పైసా చెల్లించక్కర్లేకుండా చికిత్స పొందొచ్చు. ఈ వరంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 12.50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

### తల్లులకు ఇక పండగే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కూటమి ప్రభుత్వం రూ.9,407 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లు,కాలేజీలో చదువుతున్న ఒకటి నుంచి 12వ తరగతి వరకు రూ.15 వేలు జమ చేస్తామని ప్రకటించారు. మే నెలలోగా తల్లుల ఖాతా ల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. జిల్లాకు రూ.2,476 కోట్ల నిధులొస్తాయి.

### మరింత ఆదరణ..

గత టీడీపీ ప్రభుత్వంలో బీసీల్లో ఆయా వర్గాల స్వయం ఉపాధికి అనుగుణంగా ఆదరణ పథకం కింద సీఎం చంద్రబాబు పని ముట్లను అందించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదరణ అటకెక్కించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం ఆదరణ పథకం అమలుకు శుక్రవారం నాటి బడ్జెట్‌లో వెయ్యి కోట్లు ప్రకటించారు.

### సొంతింటి కల నెరవేరినట్లే..

బడ్జెట్‌లో ప్రధానంగా రహదారుల శాఖకు రూ.8,785 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో అనేక రహదారుల మరమ్మతులకు, కొత్త వాటికి నిధులు రానున్నాయి. గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు కేటాయించడంతో పేదల ఇళ్లకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఆధునికీకరణ పనులకు రూ.848 కోట్లు కావాలి. అయితే ఈ రెండేళ్లలో వీటిని పట్టాలెక్కించేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉన్నత విద్యకు సంబంధించి కేటాయింపులు పెరిగాయి. ఆదికవి నన్నయ వర్సిటీకి రూ.12.50 కోట్లు, జేఎన్టీయూకి రూ.60 కోట్లు కేటాయించారు.

- అదిరిన 'పయ్యావుల' పద్దు
- రూ.25 లక్షల ఆరోగ్య బీమా
- 12.50 లక్షల కుటుంబాలకు ధీమా
- మే నుంచే 'తల్లికి వందనం'
- 16.51 లక్షల మంది పిల్లలకు లబ్ధి
- అన్నదాత సుఖీభవకు 4.54 లక్షల మంది
- 19.80 లక్షల మందికి ఆదరణ
- స్కూళ్లకు తీరిన కరెంటు బిల్లు బాధ
- మునిసిపాలిటీలకు మళ్లీ ఆర్థిక స్వేచ్ఛ
- మత్స్యకారులకు నిధుల పొంగు

### మునిసిపాలిటీలకు వీడిన సంకెళ్లు

పట్టణాలు, నగరాల అభివృద్ధిలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లదే కీలకపాత్ర. గత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా సర్వనాశనం చేసేసింది. గడచిన ఐదేళ్లలో మునిసిపాలిటీల్లో డబ్బులు ఖర్చుచేయడం గగనంగా మారింది. ఏప్రిల్ నుంచి మునిసిపాలిటీలు తమ చెల్లింపులు తమ నిధుల నుంచి ఖర్చుచేసుకునేలా కీలక నిర్ణయం ప్రకటించింది. దీంతో పుర పాలికలకు మళ్లీ మంచిరోజులు వచ్చినట్లయింది.

### మత్స్యకారులకు వరం..

మత్స్యకార భరోసా రూ.450 కోట్లు కేటాయించారు. ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునే పేరుతో అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని రూ.20 వేలు చేస్తామని చెప్పింది. బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించింది.ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మంది మత్స్యకారులకు మేలు జరగనుంది.

### తాగునీటికి.. బెంగ లేదిక..

జలజీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే ఉద్దేశంతో 8.46 లక్షల కుళాయిలను అందించాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.1, 203 కోట్లతో ప్రణాళికలు రచించారు. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చేసింది. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా విధించుకుంది. బడ్జెట్‌లో రూ.2,800 కోట్లు కేటాయించింది. ఈ పథకానికి నిధుల బెంగతీరింది.

### బడికి బిల్లులు బాధ తీరినట్టే..

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇవ్వనున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2 వేలకుపైగా స్కూళ్లు ఉన్నాయి. ఇకపై ఉచితంగా విద్యుత్ ఇవ్వనుండడంతో పాఠశాలలకు నిధుల బెంగ తప్పనుంది.

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం రైతులను సంతృప్తిపరిచింది. ఎంతో కాలంగా డెల్టా ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాలు మూలనపడిపోయాయి. పోలవరం ప్రాజెక్టు సైతం నత్తనడకన సాగుతోంది. బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు రూ.6705 కోట్లు కేటాయించడంతో పనుల వేగానికి ఇంధనంగా ఉపయోగపడతాయి. పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ఇటీవల 900 కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. సాధ్యమైనంత మేర నిర్వాసితులందరినీ కాలనీలకు చేర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇక ధవళేశ్వరం కేంద్రంగా ఉన్న గోదావరి డెల్టా సిస్టమ్ ఆధునికీకరణకు రూ.200 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ఏటిగట్ల అభివృద్ధికి మరో రూ.200 కోట్లు కేటాయించారు. పోలవరం లిఫ్ట్‌కు రూ.100 కోట్లు, తాడిపూడి ఎత్తిపోతల పథకానికి రూ.14 కోట్లు, వెంకటనగర్ ఎత్తిపోతలకు రూ.4 కోట్లు, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు రూ.75.51 కోట్లు, సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు రూ.7.5 కోట్లు కేటాయించి జీవం పోవారు. ధవళేశ్వరం ఇరిగేషన్ పరిధిలో వేసవి కాలంలో చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు రూ.75 కోట్లు కేటాయించారు. ఆయిల్ పామ్ పంటల ప్రోత్సాహానికి తూర్పుగోదావరి జిల్లాను ప్రత్యేకంగా ఎంపిక చేసింది.బడ్జెట్‌లో రూ.7,556 కోట్లు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి అనేక రకాల పథకాల అమలుకు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

### అన్నదాత.. సుఖీభవ

సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ మేరకు రూ.6,300 కోట్లు కేటాయించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాతలకు ఇక సాగు ఖర్చుల బెంగ తీరనుంది. గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం పేరుతో కేంద్రవాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి అన్నదాతలను మోసం చేసింది. రైతులకు అండగా చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హులైన ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఫలితంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

| ప్రాజెక్టు | రూ.కోట్లలో |
|---|---|
| పోలవరం ప్రాజెక్టు | 6,705 |
| గోదావరి డెల్టా సిస్టమ్‌కు | 200 |
| ఏటిగట్ల అభివృద్ధికి | 200 |
| పోలవరం లిఫ్ట్‌కు | 100 |
| తాడిపూడి ఎత్తిపోతలకు | 14 |
| వెంకటనగర్ ఎత్తిపోతలకు | 4 |
| పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు | 75.51 |
| తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు | 7.5 |

సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు

### ఏపీకి వెలుగునిచ్చే బడ్జెట్..



రాష్ట్ర పునర్ నిర్మాణం, అభివృద్ధి సంక్షేమానికి చిరునామా రాష్ట్ర బడ్జెట్.పర్యాటక రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు సంతృప్తికరం.బడ్జెట్‌లో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు 469 కోట్లు కేటాయింపు సంతోషకరం. కూటమిలో ఆంధ్రప్రదేశ్ ఓ వెలుగు వెలుగుతుంది.
- కందుల దుర్గేష్, మంత్రి

### ఇదీ సూపర్ సిక్స్ బడ్జెట్



అందరికి ఆమోదయోగ్యమైన బడ్జెట్. సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్ రూపొందించారు.మే నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు తల్లికి వందనం పథకాలను అమలుచేసేందుకు చర్యలు చేపట్టారు. మొత్తంగా చూస్తే ఇది జనరంజక బడ్జెట్ .
- గోరంట్ల, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే

### కరెంట్ కష్టాలు తీర్చిన బడ్జెట్



అద్భుతమైన బడ్జెట్. ఎస్సీ ఎస్టీలు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్.. చేనేత మగ్గాలపై ఆధారపడి బతికేవారికి 500 యూనిట్లు అందించేలా బడ్జెట్‌లో ప్రస్తావించారు.టిడ్కో ద్వారా 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్.
- ఆదిరెడ్డి వాసు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే

### వ్యవసాయానికి మేలు



ఆర్థికంగా అణగారిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టిని కలిగించే విధంగా బడ్జెట్ రూపొందించడం అభినందనీయం. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు చర్యలు చేపట్టడం రైతులకు ఊరట నిచ్చింది.వ్యవసాయానికి మేలు చేకూర్చేలా బడ్జెట్ ఉంది.
- ఎన్.రామకృష్ణారెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే

### జలజీవన్ మిషన్‌కు జీవం



బడ్జెట్‌లో బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట వేశారు.వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించారు.ఎస్సీ బీసీలకు ఇళ్ల నిర్మాణానికి అదనంగా రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 70వేలు అందించడానికి చర్యలు.జలజీవన్‌మిషన్ పథకంలో గోదావరి జలాలు అందించడానికి చర్యలు.
- ఎం.వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే

### ప్రతి కుటుంబానికి చేయూత



పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేలా బడ్జెట్ ఉంది. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించడం జరిగింది.ఎన్నికల హామీల్లో భాగమైన సూపర్ సిక్స్ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడం హర్షించదగ్గ విషయం.
- ఎం.వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే

### బడ్జెట్ బాగుంది..



రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం బడ్జెట్ రూపొందించింది. సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికి సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇచ్చారు. బడ్జెట్ బాగుంది.
- బత్తుల బలరామకృష్ణ,రాజానగరం ఎమ్మెల్యే

## ఏప్రిల్ లోపు నామినేటెడ్ పదవులు

### సీఎం చంద్రబాబు ప్రకటన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మళ్లీ నామినేటెడ్ పదవుల సందడి మొదలైంది. ఏప్రిల్ నెల లోపు నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించడంతో క్యాడర్‌లో జోష్ పెరిగింది.అమరావతిలోని అసెంబ్లీ హాల్‌లో శుక్రవారం ఆయన టీడీఎల్పీ సమావేశంలో మాట్లాడారు.మార్కెట్, దేవస్థాన కమిటీలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల నుంచి పేర్లు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు సూచించారు.నామినేటెడ్ పదవులు త్వరలోనే ఇస్తామని ప్రకటించడంతో కూటమి శ్రేణుల్లో సందడి నెలకొంది.పార్టీ నేతలంతా కేడర్‌ను ద్వితీయ శ్రేణి నాయకులను కలుపుకుని ముందుకువెళ్లాలని ఆయన క్లాస్ తీసుకున్నారు.

## రీజనల్ సైన్స్ సెంటర్‌కి స్వామి జ్ఞానానంద పేరు పెట్టాలి

### కేంద్రానికి రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ లేఖ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో బొమ్మూరు వద్ద నిర్మించిన రీజనల్ సైన్స్ సెంటర్‌కు స్వామి జ్ఞానానంద పేరును పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వ అటవీ పర్యావరణ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము లేఖ రాశారు. రాజమహేంద్రవరంలో రూ15.20 కోట్లతో ఈ సెంటర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. న్యూక్లియర్ సైన్స్ బోధనలో స్వామి జ్ఞానానంద తన ప్రత్యేకత చాటుకున్నారు.ఎందరో విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా తయారు చేసిన స్వామి జ్ఞానానంద పేరు పెట్టాలని లేఖలో పేర్కొన్నారు.



**చికెన్ క్యూ**

చికెన్ కొనుగోలు చేయమంటే బర్డ్ ఫ్లూ అంటున్నారు.. ఫ్రీ అంటే మాత్రం ఎగబడిపోతున్నారు.. ఈ చిత్రంలోనే చూడండి.. అనపర్తిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత చికెన్ మేళాకు జనం ఇలా క్యూ కట్టారు. ఏకంగా 3 వేల మందికి ఉడికించిన గుడ్లు, ఫ్రై చేసిన చికెన్ ఉచితంగా పంపిణీ చేశారు. - అనపర్తి

## ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.13,78,627

### జిల్లా వ్యాప్తంగా 64 బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీకి ఈ ఏడాది రూ.13,78,627 ఆదాయం లభించింది. శివరాత్రి పుణ్యస్నానాలకు వెళ్లే భక్తుల కోసం వివిధ రూట్లలో మొత్తం 64 బస్సు సర్వీసులను నడిపారు. రాజమహేంద్రవరం డిపో నుంచి 15 బస్సులు ఆపరేట్ చేశారు. కోటిపల్లి నాలుగు, వంగలపూడి నాలుగు, శ్రీశైలం ఏడు బస్సులు నడపడం ద్వారా రూ.2,80,086లు ఆదాయం ఆర్జించారు. కొవ్వూరు డిపో నుంచి 27 బస్సులు పట్టిసీమకు నడపడం ద్వారా రూ.5,92,458లు, నిడదవోలు డిపో నుంచి కూడా 13 బస్సులు పట్టిసీమకు నడపడం ద్వారా రూ.2,83,935లు,గోకవరం డిపో నుంచి 9 సర్వీసులు నడపడం ద్వారా రూ.2,22,148లు ఆదాయం ఆర్జించినట్టు ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక వెల్లడించారు.

### 5న తణుకులో చికెన్ మేళా

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న నెక్ కల్యాణ మండపంలో ఈనెల 5వ తేదీన చికెన్ మేళా నిర్వహిస్తున్నట్టు ఫౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా భీమవరం కలెక్టర్ సీహెచ్ నాగరాణి వస్తారని చెప్పారు. చికెన్, గుడ్లకు సంబంధించి ఐటెమ్‌లు ప్రదర్శించడం, వాటి గురించి వివరించడం జరుగుతుందన్నారు.

### పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

గోపాలపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్టు ఇన్‌ఛార్జి ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మండలంలో 8,997 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

**ఉండ్రాజవరం:** మండలంలో 10,298 మందికి శనివారం ఫించన్లు పంపిణీచేస్తున్నట్టు ఎంపీడీవో వీఎస్ రామారావు తెలిపారు. ఇందుకు రూ. 4.48 కోట్లు మంజూరయ్యాయన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

● టీడీపీ ఫ్లోర్ లీడర్ సూర్యభాస్కర రామ్మోహన్ (చిన్ని)
● చైర్‌పర్సన్ రత్నకుమారి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం


సమావేశాని హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని మున్సిపల్ కౌన్సిల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని సూర్యభాస్కర రామ్మోహన్ (చిన్ని) అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. చిన్ని మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల సౌకర్యార్థం కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశా లను కొంతమంది సిబ్బంది వక్రీకరించి బయటకు తెలియజేస్తున్నారని, అది సరికాదని అటు వంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా పట్టణంలో తాగునీటి పైపులైను లీకేజీలను అరికట్టి, వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లేఅవుట్ 1లో రెండు మోటా ర్లు మరమ్మతులకు గురయితే ఒకటి రిపేర్లు చేయించగా, కాలనీవాసులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదన్నారు. అలాగే ఔరంగాబాద్‌లో అవుట్ ఫాల్ డ్రెయిన్‌లు ఆక్రమణలకు గురవ్వడంతో మురుగు ముందుకు పారడం లేదన్నారు. 2025-26 మున్సిపల్ ఆశీలు గెజిట్‌లో ప్రతిపాదించిన ధరలను కౌన్సిల్ సభ్యులకు తెలియజేయాలన్నారు. మున్సిపల్ మేనేజర్ పీ.సాయిబాబు మాట్లాడుతూ 2025-26 ఏడాదికి ఆశీలు వసూలుకు గెజిట్‌లో సవరణ చేయడానికి గత కౌన్సిల్‌లో తీర్మానం పెట్టగా వాయిదా పడిందన్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ రుడా అభివృద్ధి చేసిన గోదావరి నదిపై ఉన్న పార్క్ వినియోగంలోకి రాకుండానే మరమ్మతులకు గురవుతుందన్నారు. 16వవార్డు కౌన్సిలర్ కండెల్లి రామారావు మాట్లాడుతూ ఔరంగాబాద్‌లో డ్రైనేజీలు పూడిపోయి మురుగునీరు ముందుకు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బత్తి నాగరాజు మాట్లాడుతూ కొవ్వూరు పట్టణంలో కోవిడ్ కారణంగా రైళ్ల హాల్ట్‌లను నిలుపుదల చేసింది. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనరాకపోకలు నిలుపుదల చేయడంతో పట్టణంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లరాక, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు గామన్‌బ్రిడ్జి మీదుగా వెళ్లిపోవడంతో కొవ్వూరు పట్టణం ఉనికిని కోల్పోతుందన్నారు. కోవిడ్ ముందు కొవ్వూరులో ఆగే అన్ని రైళ్లు నిలుపుదల చేయాలని, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు పట్టణంలోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని, గామన్‌బ్రిడ్జి వద్ద హైటెక్ బస్టాండ్‌ను నిర్మాణం చేపట్టాలని కౌన్సిల్ తీర్మాణం చేసి ఎమ్మెల్యే ఎంపీ, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలన్నారు. దీనిపై చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని, వచ్చే కౌన్సిల్ సమావేశంలో రైళ్లు, ఆర్టీసీ బస్సులకు సంబం ధించి తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగంలో పదవీ విరమణ ఒక భాగం : ఎంపీడీవో


ఉమామహేశ్వరశర్మను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ ఒక భాగమని ఎంపీడీవో కే. సుశీల అన్నారు. శుక్రవారం కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఈవోఆర్‌డీ ఉమామహేశ్వరరావు పదవీ విరమణ అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతటి కఠినమైన సమస్యనైనా సున్నితంగా పరిష్కరించే నైపుణ్యం ఉమామహేశ్వరరావు సొంతమని కొనియాడారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కొవ్వూరు నియోజకద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, పలువురు ఉద్యోగులు ఈవోఆర్‌డీ శర్మ సేవల గురించి మాట్లాడారు. అనంతరం శాలువా, పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, జడ్పీటీసీ బొంతి వెంకటలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, నామాన పరమేష్, ఇతర జిల్లాలకు చెందిన ఈవోఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ కార్యదర్శులు, మండలంలోని నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శంకరాచార్య వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో వేదసభ


సభలో పాల్గొన్న ఘనాపాటీలు

కొవ్వూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుషోత్తమ రామమందిరంలో శుక్రవారం శంకరాచార్య వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో వేదసభను నిర్వహించారు. స్మార్థ పండితులు మేడూరి సుబ్బన్న స్థాపించిన వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 25 సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఘణాపాటి శ్రీపాద మాణిక్య అవధాని, గొల్లపల్లి దత్తాత్రేయ ఘణాపాటీల ఆధ్వర్యంలో నాలుగు వేదాలను పారాయణం చేశారు. మేడూరి సూర్యనారాయణ, శ్రీనివాస్, మేడూరి రమేష్, ఎం. కోటేశ్వరరావు, తుట్టగుంట బైరవమూర్తి, కృష్ణంపల్లి శ్యామసుందరరావు, సీతమ్మ, రావులపాలెం అవధానులు రమాకాంత్‌శర్మ, సుమారు 50 మంది వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలతో రైతుల ఆందోళన

తాళ్లపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించే రైతు ఏదో ఒక రీతిన నష్టపోతూనే ఉన్నాడని చెప్పేందుకు మండలంలోని మలకపల్లిలో జరిగిన సంఘటనే ఉదాహరణ. గత ఖరీఫ్‌లో కేళీ విత్తనాలతో ఇబ్బందులు పడ్డట్టే .. ఈఏడాది కూడా దాదాపు 300 ఎకరాలలో పీఆర్ 126రకం విత్తనాన్ని వాడి నాలుగు రకాల కేళీలు పంటలో కనపడడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు గ్రామంలో పలువురు రైతులు ఆ విత్తనాలను దేవీ ఏజెన్సీస్ వద్ద కొనుగోలు చేశామని.. పంటలో నాలుగు రకాల కేళీలు కనపడుతున్నాయని, ఏజెన్సీ వారిని ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పటం లేదని పలువురు రైతులు కంపెనీ ప్రతినిధి హరీష్‌ని మలకపల్లి రప్పించి నిలదీశారు. హరీష్ రైతులతో మాట్లాడుతూ కేళీ వచ్చినంత మాత్రాన నకిలీ విత్తనాలు కావని, ఈ విషయం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు నిర్ణయించాలని తెలిపారు. దీనిపై ఏవో రుచిత మాట్లాడుతూ కేళీల శాంపిల్స్ సేకరించి పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో మూతిన రాము, గారపాటి మూర్తి, ఇమ్మణ్ణి సత్యనారాయణ, మద్దిపాటి రామారావు పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తాళ్లపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్స్‌పాల్ పీటీ గౌరీనాథ్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 325 మంది, రెండో సంవత్సరంలో 260 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అలాగే సీసీ కెమెరాల పర్యవేక్షణ, వైద్య శిబిరం, తాగునీటి సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. స్థానిక కళాశాల విద్యార్థులతో పాటు కరిబండి, విశ్వాసం, అన్నదేవరపేట ప్లస్2 విద్యార్థులు కూడా ఈ పరీక్షా కేంద్రంలోనే పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు 30 నిముషాలు ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరవ్వాలని సూచించారు.

### నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

చాగల్లు, ఫిబ్రవరి 28, (ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నివారణ పథకంలో భాగంగా శనివారం నుంచి మండలంలో నెలరోజుల పాటు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయటం జరుగుతుందని పశువైద్యాధికారి యు. ముఖేష్ తెలిపారు. పాడి రైతులందరూ పశువులకు టీకాలను వేయించుకోవాలన్నారు.

### శివ సాయి ధామం ట్రస్టు ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణం


రిజిస్ట్రార్‌కు తాళాలు అందజేస్తున్న శివ సాయి ధామం ట్రస్టు సభ్యులు

కొవ్వూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోరుతూ ఒక మంచి పనిచేస్తే 10 పనులు వాటంతటవే వస్తాయని శ్రీ శివ సాయి ధామం సేవా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శ్రీ సుందర సాయి సేవా కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శివ సాయి ధామం సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో రిజిస్ట్రేషన్లకు వచ్చే కక్షిదారులు, మహిళల సౌకర్యార్థం రూ. 60 వేల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మించారు. ఈ మేకుఉ శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కే.సుందరరావుకు తాళాలను అందజేశారు. సేవా సమితి కార్యదర్శి రెడ్డి తాతయ్యబాబు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని గోదావరి తీరంలో శివ సాయి ధామం హిందూ స్మశాన వాటికను నిర్వహణ చేపట్టడంజరిగిందన్నారు.సేవాసమితి ఉపాధ్యక్షుడు పరిమి రాజేష్, నగళ్లపాటి శ్రీనివాస్, ఎన్. సుబ్రహ్మణ్యేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


కొవ్వూరులో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు

కొవ్వూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరిశోధనల్లో ముందడుగు వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే. సునీత పిలుపునిచ్చారు. కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన బయోడైవర్సిటీ, నీటిని శుద్ధిచేయుట, కిరణజన్య సంయోగక్రియ, సెన్సార్ సిస్టమ్ వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, భూపతిరాయలు, సునీత,సాదిక్ అహ్మద్, అరుణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే శ్రీసద్గురు పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కీర్తిశ్రీ మాట్లాడుతూ మానవ జీవితంలో సైన్సు ఒక భాగమన్నారు. హోలీ ఏంజిల్స్ పాఠశాలలో కరస్పాండెంట్ వలియవీడు నెల్సన్ ఆంటోనీ ఆధ్వర్యంలో సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు.

**నిడదవోలు:** సైన్స్ సాయంతో మరిన్ని ఉన్నత లక్ష్యాలతో


నిడదవోలు మహిళా డిగ్రీ కళాశాలలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

ముందుకు సాగాలని భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఎస్.నాగేశ్వరరావు అన్నారు. నిడదవోలు పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ డాక్టర్ డీ.రుద్ర మాట్లాడుతూ సైన్స్ అభ్యున్నతితోనే గ్లోబల్ లీడర్‌షిప్ సాధ్యమవుతుందన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేసారు. కార్యక్రమంలో కే.సుమలత, పీవీఎల్ నారాయణ, డాక్టర్ పీ.లలిత, సత్యనారాయణ, కృష్ణవేణి, డాక్టర్ కే.తంబయ్య, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

**తాళ్లపూడి:** వేగేశ్వరపురం కేఎస్ఆర్ జడ్పీ హైస్కూల్లో నేషనల్ సైన్స్‌డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 3వ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను వారి తల్లిదండ్రులు వీక్షించారు. దీనిలో ముఖ్యంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో తయారుచేసిన వర్కింగ్ మోడల్స్ పలువుర్ని ఆకట్టుకుంది. సైన్సు ఉపాధ్యాయని గుడివాడ దుర్గాభవాని ఆధ్వర్యంలో రైన్ డ్రాప్ అలారం, వాయిస్ కంట్రోల్ వీల్ చైర్, క్యూఆర్ కోడ్ జెనరేట్, క్రాప్ సేవ్, స్టడీల్యాంప్, బ్లైండ్ స్టిక్, తదితర 25 రకాల ప్రాజెక్టులను విద్యార్థులు తయారుచేశారు. ఎంఈవో, పాఠశాల హెచ్ఎం బాలామణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులలో సృజనాత్మకత, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలు పెరిగేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. సైన్సు టీచర్లు దుర్గాభవాని, సుభాషిణి, నాగరత్నం, వరలక్ష్మిను ఎంఈవో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్‌రాజ్, సుజాత, సంధ్య, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

**చాగల్లు:** జాతీయ సైన్సు దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. స్థానిక శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా డైరెక్టర్ వీవీ రామారావు మాట్లాడుతూ యువతకు సీవీ రామన్ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌కే కరీమ్, గౌడ్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సర్ సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉండ్రాజవరం, వేలివెన్ను, మోర్త, తాడిపర్రు తదితర హైస్కూల్, కాల్ధరి నెం.3 పాఠశాలలో పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కాల్ధరి నెం.3 పాఠశాలలో ఉపాధ్యాయురాలు కుసుమ నిరుపయోగ వస్తువులతో ఆటోమేటిక్ ఫైర్ అలారం, ఫైర్ ఇంజన్ పని విధానం, ఆటోమేటిక్ వాటర్ సిస్టమ్, వాషింగ్ మెషిన్, ట్రైన్, విమానం, ఏటీఎం వర్కింగ్ మోడల్స్‌ను తన భర్త సిరాజుద్దీన్ సహకారంతో తయారుచేసి విద్యార్థులకు పనిచేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కే. మాణిక్యాలరావు, శ్రీనివాస్, గణేష్, సుభద్రభాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వేగేశ్వరపురంలో హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

### చికెన్‌ను నిర్భయంగా తినొచ్చు

● నల్లజర్లలో చికెన్, ఎగ్ మేళా


మాట్లాడుతున్న ఏడీఏ శామ్యూల్

నల్లజర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, చికెన్, ఎగ్‌ను నిర్భయంగా తినొచ్చని పశుసంవర్ధక శాఖ ఏడీఏ శామ్యూల్ అన్నారు. శుక్రవారం నల్లజర్ల టీఎస్ఎన్ వెంచర్‌లో వెంకటేశ్వర హెచరీస్,మండల పౌల్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత చికెన్, ఎగ్‌మేళా నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో కేవలం పెరవలి, ఉండ్రాజవరంలో మాత్రమే బర్డ్‌ఫ్లూ వచ్చిందన్నారు. అచ్చన్నపాలెం, ఇతర గ్రామాలలో సేకరించిన నమూనాలు పూణే ల్యాబ్‌కు పంపించామని, అయితే ఎక్కడా బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవన్నారు. నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీ డాక్టర్స్ గంగాధర్, రాజశేఖర్, పౌల్ట్రీస్ రైతు బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ శాంతి ప్రియా, ఎస్ఐ రమేష్, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, పసుమర్తి రతీష్, ఆలపాటి రామకృష్ణ, పావూలూరి శ్రీనివాస్ , బూరుగుపల్లి వేణు పాల్గొన్నారు.

### ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

నల్లజర్ల,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం చేసే ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని విద్యుత్ శాఖ ఈఈ నారాయణ అప్పారావు అన్నారు. స్థానిక విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో లైన్‌ఇన్స్పెక్టర్‌గా పని చేస్తూ పదవీ విరమణ చేసిన ఈదా డేవిడ్‌ను ఆ శాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం తోటి ఉద్యోగులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఏడీఏ శివప్రసాద్, ఏఈలు రమణ, బాపిరాజు 1104 యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### ఆ మృతదేహం.. శాటిలైట్ సిటీ వాసిదిగా గుర్తింపు

కొవ్వూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ నెల 27వ తేదీన మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభించిందని పట్టణ సీఐ పీ. విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... రాజమహేంద్రవరంరూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీకి చెందిన కసిరెడ్డి రవి (55)గా గుర్తించారు. ఈయన జంగారెడ్డగూడెంలోని ఓ హోటల్‌ల్లో వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటికి వెళ్లడానికి రాజమహేంద్రవరం బయలుదేరాడు. మార్గమధ్యలో ఏమయ్యిందో తెలియదు కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఇనుప కుర్చీలపై పడుకుని మృతిచెందాడు. మృతుని భార్య భారతి అందించిన ఫిర్యాదుపై పట్టణ ఎస్ఐ కే. జగన్మోహనరావు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ములక్కాడలు కోస్తూ చెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కే. జగన్మోహనరావు తెలిపారు. వివరాలివి పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన కోట ముసలయ్య ఈనెల 23న ములక్కాడలు కోయడానికి చెట్టు ఎక్కాడు. కొమ్మ విరిగి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఇతని కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

### నేటి నుంచి కొత్త టాఫ్రిక్ రూల్స్

తాళ్లపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మార్చి 1వ తేదీ నుంచి కొత్త ట్రాఫిక్ రూల్స్, జరిమానాలు అమలులోకి వస్తాయని ఎస్ఐ టీ. రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు


పల్లంట్లలో పుష్పయాగంలో ఆలయ కమిటీ సభ్యుడు సత్యనారాయణ దంపతులు

దేవరపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పల్లంట్ల రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారికి పల్లకీసేవ, పుష్పయాగం, కోలాట భజనలు, త్రిశూలస్నానం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు వై.సృజనాశర్మ, వై.రామకృష్ణ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కొయ్యలమూడి సురేంద్రనాథ్, ఎం.శ్రీనివాసరావు, తాలూరి శ్రీనివాసరావు, నలమాటి జానకి రామయ్య, కూచిపూడి రజని పాల్గొన్నారు.

## టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి


తాళ్లపూడిలో థామస్ సెయింట్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కుట్టుమిషన్ సృష్టికర్త థామస్ సెయింట్ జన్మదినోత్సవాన్ని టైలర్స్ డే గా జరుపుకుంటున్నామని తాళ్లపూడి టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒంబోలు పోసిబాబు తెలిపారు. ఈ సందర్భంగా థామస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు టైలర్లు మాట్లాడుతూ టైలర్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యలమర్తి సుబ్రహ్మణ్యం, కొక్కిరాల కిశోర్, పోతుల గాంధీ, గుత్తి కొండ రామాంజనేయులు పాల్గొన్నారు.

**గోపాలపురం:** కుట్టుమిషన్ సృష్టికర్త థామస్ సెయింట్ జన్మదినం సందర్భంగా టైలర్స్ డేను శుక్రవారం మండల టైలర్స్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు సెంటర్‌లో కేకును కోసి అసోసియేషన్ సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు. షేక్ సికిందర్, షేక్ బాజీ, దోనిల్లి వెంకటరమణ, ఎన్‌వీ రావు, అరీఫా, రహమతున్నీషా, భద్రం గంగరాజు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** ఆధునిక యుగంలో టైలర్ల జీవనం అగమ్యగోచరంగా తయారైందని మండల వినాయక సహకార సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వాసు అన్నారు. శుక్రవారం టైలర్స్‌డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ, వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్ దర్జీలను సన్మానించారు. కుట్టుమిషన్ పితామహుడు ఇలియాస్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టైలర్స్ సంఘం నాయకులు మిరియాల వెంకటేశ్వరరావు, చాపల వెంకట్రావు, ఆకుల శ్రీను, లింగమూర్తి, వెంకట్రావు, లక్కా వెంకటలక్ష్మి, జగపతి రాణి, సంఘసభ్యులు పాల్గొన్నారు.